యాగంటిలో రూ.3 కోట్లతో కళ్యాణమండపం

- నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసిన టీటీడీ చైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి: నంద్యాల జిల్లా యాగంటి క్షేత్రంలో రూ 3 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో టీటీడీ నిర్మించనున్న కల్యాణ మండపానికి టీటీడీ చైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి సోమవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోని పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తున్నామని చెప్పారు. పవిత్ర పుణ్య క్షేత్రమైన యాగంటిలో రూ 3 కోట్లతో కల్యాణ మండపం నిర్మిస్తున్నామని అన్నారు. ఎన్నో ఏళ్ళ క్రితం నిర్మించిన కల్యాణ మండపాలు చాలా ఏళ్ళుగా మరమ్మత్తులకు నోచుకోలేదని ఆయన చెప్పారు. అవసరమైన కల్యాణ మండపాలకు రిపేర్లు చేయించాలని తమ పాలక మండలి నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగానే నంద్యాలలో కల్యాణ మండపాన్ని పునర్నిర్మించడానికి చర్యలు చేపట్టామని చైర్మన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా సనాతన హిందూ ధర్మ ప్రచారానికి తమ పాలక మండలి పెద్ద ఎత్తున చర్యలు తీసుకుందని శ్రీ సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ రాజేంద్ర నాథ్ రెడ్డి, ఎంపి శ్రీ బ్రహ్మానందరెడ్డి, శాసన సభ్యులు శ్రీ రామిరెడ్డి, శ్రీ రాంభూపాల్ రెడ్డి, శ్రీ హఫీజ్ ఖాన్, టీటీడీ ఈవో శ్రీ ధర్మారెడ్డి, జేఈవో శ్రీమతి సదా భార్గవి, ఎస్వీబీసీ సిఈవో శ్రీ షణ్ముఖ కుమార్,ఎస్ ఈ శ్రీ జగదీశ్వర్ రెడ్డి, విజివో శ్రీ మనోహర్, శ్వేత డైరెక్టర్ శ్రీమతి ప్రశాంతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మా కడుపులు కొట్టొద్దు

సాగు భూములలో మైనింగ్ అనుమతులు రద్దుచేయాలి

- ఊనుగుంటపాలెం రైతుల ఆందోళన

విశాలాంధ్ర - గూడూరు : మా కడుపులు కొట్టొద్దు అంటూ సిలికా మైనింగ్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో చిల్లకూరు మండల ఊనుగుంటపాలెం రైతులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రైతులను నాశనం చేసే సిలికా మైనింగ్ కు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని నాయకులు ఉద్ఘాటించారు. చిల్లకూరు మండలం మోమిడి రెవెన్యూ పరిధిలోని ఊనుగుంటపాలెం గ్రామ సర్వే నెంబర్ 441, 734, 735, 736, 451, 737, 663, 439, 440, 469, 434, 438 లలో సుమారు 120 ఎకరాల భూములు ఎస్సీ, బీసీ కులాలకు చెందిన 100 కుటుంబాలు 70 ఏళ్లుగా సాగుచేసుకుని జీవిస్తున్నారన్నారు. ఒక్కొక్క కుటుంబానికి ఒక ఎకరా, రెండు ఎకరాలు సాగు చేసుకుంటున్నామన్నారు. గత 70 సంవత్సరాలుగా ఆ భూములలో సవక, జామాయిల్ సాగు చేసుకుని జీవిస్తున్నామన్నారు. గత 15 ఏళ్లుగా ఈ భూములలో బంకమట్టి తోలుకొని వేలాది రూపాయలు ఖర్చు చేసి వేరుశనగ పంటని సంవత్సరానికి మూడు దఫాలుగా పండించుకుంటున్నామన్నారు. ఈ భూములలో కొంతమందికి ప్రభుత్వం డీకేటి పట్టాలు ఇచ్చిందన్నారు. కొందరి పేర్లను ప్రభుత్వ రికార్డులలో నమోదు చేసి ఉన్నారన్నారు. రైతులు అనుభవంలోని భూములకు ప్రభుత్వం సర్వే చేయించి పట్టాలను మంజూరు చేసి ఆదుకో వాలన్నారు. గ్రామ భూములలో కొందరు సిలికా మైనింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామ సభను నిర్వహించారన్నారు. గ్రామ సభలో ప్రజలు వ్యతిరేకించినప్పటికీ అనుమతులు మంజూరు చేయడం దారుణమన్నారు. భూములకు నీరు అందించే మోమిడి కాలువ పూర్తిగా ఎండిపోతోందన్నారు. ఈ భూములను ఆనుకొని ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ భూములకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఊనుగుంటు పాలెంలోని గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ సిలికా మైనింగ్ తవ్వకాలతో రైతుల బ్రతుకులను పాలకులు దెబ్బతీస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజలు వ్యతిరేకించిన మైనింగ్ కంపెనీలకు అనుమతులు ఇస్తున్నారన్నారు. ఊనుగుంటపాలెం రైతులు మైనింగ్ యజమానుల కుట్రలను గమనించి ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకొని అధికారులు వెనుతిరిగేటట్టు చేశారన్నారు. గతంలో కూడా కొత్తపట్నం గ్రామంలో రైతులు ఎదిరించి భూములు కాపాడుకున్నారన్నారు. రైతులు తరతరాలుగా భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, రైతులకు నష్టం చేసి మైనింగ్ కంపెనీలకు కోట్లాది రూపాయలు లాభం చేస్తున్నారన్నారు. పట్టాలున్నా, సాగు చేసుకుంటున్న భూముల్లో మైనింగ్ కు ఏ విధంగా అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నించారు. అక్రమ మైనింగ్ తో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. తాగునీరు, సాగునీరు అందించే సానకాలవలు దెబ్బతిని కలుషితమై ప్రజలకు జబ్బులు వచ్చే ఆస్కారం ఉందన్నారు. రైతుల బాగుకోరే ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి చర్యలకు పూనుకోదన్నారు. రైతులకు నష్టం చేస్తే విధానాలు మానుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు రైతులు అండగా నిలబడాలన్నారు. అలా జరగని పక్షంలో సిలికా మైనింగ్ కు అనుమతులు రద్దు చేసేంతవరకూ పోరాటం ఆగదన్నారు. అనంతరం ఆర్డీఓ కిరణ్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. నాగరాజు, నాయకులు ఎస్ ముత్యాలయ్య, రైతు సంఘం నాయకులు జోగి శివయ్య, సిఐటియు నాయకులు పి మణి, ఆర్ శ్రీనివాసులు, బివి రమణయ్య, కెవిపిఎస్ నాయకులు ప్రసాద్, రైతులు రామచంద్రయ్య, మహేష్, సుబ్బయ్య, రామయ్య, జయరామయ్య, వెంకయ్య, సుబ్బరామయ్య, మణి, వీరరాఘవయ్య, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

రాజమార్గంలోనే వ్యాపారం చేయాలి

పాన్‌బ్రోకర్స్‌కు వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూచన

విశాలాంధ్ర - గూడూరు : పాన్ బ్రోకర్స్ రాజమార్గంలోనే వ్యాపారం చేస్తూ పన్నులు సకాలంలో చెల్లించాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్‌రావు సూచించారు. సోమవారం గూడూరులోని కోనేటి మిట్ట ద్వారకామయి ఫంక్షన్ హాల్‌లో వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో పాన్ బ్రోకర్స్, బంగారు వర్తకులతో ఫ్రెండ్లీ ట్రేడ్ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో అనేక మంది పాన్ బ్రోకర్స్ కుదువ వ్యాపారంతోపాటు బంగారు వస్తువులు విక్రయిస్తున్నారన్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందన్నారు. లైసెన్సులు పొంది రాజమార్గంలో వ్యాపారం చేసుకోవాలని సూచించారు. అలాగే అనేక మంది వ్యాపారస్థులు కొన్ని బంగారు, వెండి వస్తువులకు బిల్లులు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి వస్తువుకూ బిల్లులు ఇవ్వడం అలవాటు చేసుకోవాలన్నారు. వ్యాపారస్థులు తమ హక్కులతోపాటు బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. ఏడాదికి బంగారు వర్తకులు 1.5 కోట్ల రూపాయలకు తక్కువ కాకుండా వ్యాపారం చేస్తున్నారన్నారు. అయితే పన్నులు మాత్రం 20 నుండి 40 లక్షల రూపాయలకు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఈ పద్ధతి సరికాదన్నారు. గూడూరు పట్టణంలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఆడిట్ చేసేంత వరకూ వేచి ఉండక పన్నులు సక్రమంగా సకాలంలో చెల్లించాలని సూచించారు. ఏ ప్రాంతంలో అయితే తక్కువ పన్నులు ఎక్కువ వ్యాపారం జరుగుతుందని తెలుస్తుందో ఆయా ప్రాంతంలో తప్పనిసరిగా తనిఖీలు, ఆడిట్ చేపడుతామన్నారు. అంతకుముందు పాన్ బ్రోకర్స్, బంగారు వర్తకులను కోట అసోసియేట్ అధినేత డాక్టర్ కోట సునీల్ కుమార్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీటీఓ ప్రమీల, వ్యాపార సంఘ నాయకులు సోమిశెట్టి చెంచురామయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, సేల్ టాక్స్ ప్రాక్టీషనర్ కోట సునీల్ కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు నాట్యకారులకు అవార్డులు

విశాలాంధ్ర - గూడూరు : హైద్రాబాద్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కార్తీక మాస నృత్య మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన లు నిర్వహించి నాట్యంలో ప్రతిభ కనపరిచిన చిన్నారులకు నాట్యకిరిటీ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఆర్.ఎం ముం బాయి ఇంటర్నేషనల్ కల్చరల్, ఈవెంట్ వ్యవస్థాపకులు డాక్టర్ రాధామోహన్, సినీ నటులు రాగిణీ, వై.విజయ, టీవీ నటి, వ్యాఖ్యాత ప్రత్యూష, నాట్య సామ్రాట్, శ్రీనివాసరావు హాజరయ్యారు. నృత్య గురువు పిండి మల్లి ఆధ్వర్యంలో గూడూరు సంస్కృతి సమ్మేళనం, శ్రీ పొన్నలూరు వీరరాఘవరెడ్డి సంగీత, మత్య పాఠశాల, శ్రీశివ, పిల్లెల భవిష్య, బోజీత్ సాయి కీర్తన మోహన్,లలితభరత నాట్య కళాక్షేత్రంలో శిక్షణ పొందిన పిండి సుహర్షిణి, చందన, మిథిన్ శ్రీనివాస్, క్రుతిక మోక్షశ్రీ.ఉదతా షర్మిత యాదవ్, శ్రీహిత దీపిక, శ్రీధార, ప్రణతలు ఉత్తమ ప్రదర్శన ఇచ్చారు.

మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు : ఈఓ

విశాలాంధ్ర - గూడూరు : ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా కార్తీక మాసం సందర్భంగా గూడూరు పట్టణంలోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నవీన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ. 516 చెల్లించిన వారికి వారి నామ గోత్రాలతో ప్రతిరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు అర్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిరోజు ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఎలక్ట్రిక్ బైక్‌ల ఆవిష్కరణ

విశాలాంధ్ర - గూడూరు : ఆదిశంకర ఇన్నోవేషన్ అండ్ ఇంకులేషన్ సెంటర్, భారత్ ఆల్టర్నేట్ ఫ్యూయల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా ఎలక్ట్రికల్ స్కూటర్లు రూపొందిచాయని, వాటిని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని కళాశాలల చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. సోమవారం ఆదిశంకర కళాశాలలో ఎలక్ట్రిక్ బైక్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ వాహనాల పరీక్షలు జరుగుతున్నాయన్నారు. తమ సెంటర్ ద్వారా 12 స్కూటర్లను ఆవిష్కరించామన్నారు.

లక్ష్య సాధనతోనే విజయం

విశాలాంధ్ర - గూడూరు : ఒక లక్ష్యంతో ముందుకు సాగితే విజయం తధ్యమని గూడూరు అడిషనల్ జ్యూడిషియల్ జడ్జి లోకనాథం అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం గూడూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష సాధనతో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఏదో ఒక రంగంలో గుర్తింపు తెచ్చుకునేలా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మహబూబ్ భాషా, అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని త్యాగరాజావీధిలో కొలువై ఉన్న శ్రీ సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

- అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ

విశాలాంధ్ర - తిరుపతి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, పిర్యాదులు, అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరిస్తామని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో వచ్చిన పిర్యాదులను వారు స్వీకరించారు. 12వ వార్డు కార్పొరేటర్ ఎస్.కె.బాబు ఫోన్ ద్వారా మాట్లాడుతూ తమ వార్డులో తెలుగుగంగ లైన్ వేసారు కాని ఇంటింటికి కనెక్షన్ ఇవ్వలేదని, పద్మావతి కళ్యాణ మండపం వద్ద స్వాగతం ఆర్చ్ పాడైపోయిందని, నాగేంద్ర కుమార్ అనే వ్యక్తి నాలుగు నెలల ముందు ఇంటి కొళాయి కనెక్షన్ కు డబ్బులు చెల్లించిన ఇంతవరకు కనెక్షన్ ఇవ్వలేదని చెప్పడంతో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. హరిచంద్ర శ్మశానంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, అదేవిధంగా సింగాలగుంట కరెంట్ ఆపిసు వెనుకగల అర ఎకరం భూమిని ఆక్రమిస్తున్నారనే పిర్యాదులపై స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుపతిలో అసుస్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర తిరుపతి క్రైమ్ : దేశవ్యాప్తంగా బ్రాండ్ యొక్క వాణిజ్యం మరింతగా విస్తరించడంలో భాగంగా తైవనీస్ సాంకేతిక సంస్థ అసుస్ ఇండియా నేడు తమ ప్రత్యేకమైన బ్రాండ్ స్టోర్‌ను తిరువతిలో ప్రారంభించారు. ఈ స్టోర్‌లో కంపెనీ యొక్క ఎలక్ట్రానిక్స్ మరియు కంప్యూటర్ హార్డ్‌వేర్ అందుబాటులో ఉంటుంది. వీటిలో అసుస్ ప్రతిష్టాత్మకమైన ఉత్పత్తులు అయినటువంటి వివోబుక్, జెన్‌బుక్,జెన్‌బుక్ %--%ఫ్లిప్, డెస్క్‌టాప్‌లు, రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్ఓజీ) ల్యాప్‌టాప్స్ ప్రదర్శించనున్నారు. తిరుపతి నగర నడిబొడ్డున ఉన్న ఈ నూతన ఎక్స్‌క్లూజివ్ ప్రీమియం స్టోర్ 235 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఈ సందర్భంగా అర్నాల్డ్ సూ,బిజినెస్ హెడ్, కన్స్యూమర్ అండ్ గేమింగ్ పీసీ,సిస్టమ్ బిజినెస్ గ్రూప్,అసుస్ ఇండియా మాట్లాడుతూ భారతదేశంలో మా వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని చాలా సంతోషంగా ఉన్నామని అతి ముఖ్యమైనగా ఆంధ్రప్రదేశ్ ఒకటిని ఈ నూతన బ్రాండ్ స్టోర్‌ను తిరుపతిలో ప్రారంభించడమన్నది.దేశ వ్యాప్తంగా విభిన్న ప్రాంతాలలో మా తాజా ఆవిష్కరణలతో వినూత్న అనుభవాలను అందించడం ద్వారా వినియోగదారులకు తగిన శక్తిని అందించాలనే మా ప్రయత్నాలలో కీలకమైన ముందడుగుగా నిలుస్తుంది.వినియోగదారులను మరింత గా ఆకట్టుకునే విధంగా టచ్‌పాయింట్లను సైతం ఏర్పాటు చేశామని అన్నారు.తిరుపతిలో మొట్టమొదటి రిటైల్ స్టోర్ లో తాజా గేమింగ్,లైఫ్ స్టైల్ ఉత్పత్తులు అయినటువంటి పీసీలు, డెస్క్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, విస్తృతశ్రేణి యాక్ససరీలు అందిచనున్నామన్నారు.ఈ వాణి జ్యస్టోర్ ను ఎస్‌వీ కంప్యూటర్స్ ఎన్ గాడ్జెట్స్, ఆరోగ్య ఫార్మసీ మరియు వీఐపీ రెసిడెన్సీ హోటల్ ఎదురుగా,కొర్లగుంట జంక్షన్,తిరుమల బైపాస్ రోడ్ , తిరువతి517501 ఏర్పాటు చేశామని తెలిపారు.

గణాంక అధికారులతో ఆర్డీఓ సమీక్ష

విశాలాంధ్ర - గూడూరు : గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కిరణ్ కుమార్ డిప్యూటీ గణాంక అధికారులు, సహాయ గణాంక అధికారులతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గణాంకాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్ టాపర్‌కు చిరు సత్కారం

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు టౌన్ కొత్తపేట లింగాయత్ వీధిలో నివాసముండు ఆర్య వైశ్య అబ్బాయి శేగు సుబ్రహ్మణ్యం మనవడు వీకే నిత్యానంద్ ఎంపీసీ లో రెండు సంవత్సరాలకు కలిపి 1000 మార్కులకు గాను 971 మార్కులు సాధించి పలమనేరు టౌన్ సెకండ్ ర్యాంకు సాధించిన అబ్బాయికి చిరు సత్కారంచేయడం జరిగిందని లక్ష్మీపతి తెలిపారు

55ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

విశాలాంధ్ర -తిరుపతి : ఐదు వేర్వేరు సంఘటనల్లో 55ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు రేంజ్ డీఐజీ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ మేడా సుందరరావు పర్యవేక్షణలో రిజర్వు ఇనస్పెక్టర్లు సురేష్ కుమార్ రెడ్డి, కృపానంద, చిరంజీవి టీమ్ లు ఆదివారం కూంబింగ్ చేపట్టాయి. అన్నమయ్య జిల్లా రాజంపేట రొల్లమడుగు ఫారెస్ట్ బీట్ పరిధిలోని పెద్దకోన అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు తారస పడ్డారు. టాస్క్ ఫోర్సు పోలీసులను చూసి పారిపోగా తమిళనాడుకు చెందిన కుప్పుస్వామి (35) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 5ఎర్రదుంగలతో పాటు రెండు గొడ్డళ్లు, 2బ్యాగులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మేడా సుందరరావు తెలిపారు. మరో సంఘటనలో మామండూరు ఫారెస్ట్ కలివిలేటికోసం వద్ద స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయారు. ఆ ప్రాంతంలో 13ఎర్రచందనం దుంగలు లభించాయి. మరో సంఘ టనలో సానిపాయ బేస్ క్యాంప్ రొల్లమడుగు బీట్ పరిధిలో పెద్ద బురుజు నిషేధిత ప్రాంతంలో తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన దొరైస్వామి విజయకుమార్ (23)ను అరెస్టు చేసి, 5ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా శేషాచలం రిజర్వు ఫారెస్టు చంద్రగిరి మండలం నాగపట్ల ఈస్ట్ ఫారెస్టు పరిధిలో బొగ్గల కోన వద్ద స్మగ్లర్లను అడ్డకుని 10ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో సంఘటనలో అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజ్ పాయసెలు అటవీ ప్రాంతంలో తమిళనాడుకు చెందిన తిరుమలై (36)ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 22ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మొత్తం 55ఎర్రచందనం దుంగలు 1359. 250కిలోలు ఉండగా, రూ.75లక్షలు ఉంటుందని తెలిపారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌ను సందర్శించిన మహిళా వర్శిటీ విద్యార్థులు

విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగం విద్యార్థినులు ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా సోమవారం సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ను సందర్శించినట్లు విభాగాధిపతి ఆచార్య బి. విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముందుగా లైబ్రరీ విభాగంలోని ఆడిటోరియంలో ఎస్.హెచ్.ఏ.ఆర్ గురించి ఒక వీడియో ప్రదర్శించారని చెప్పారు. ఎస్.హెచ్.ఏ.ఆర్ స్థాపన, అంచలంచలుగా ఎలా అభివృద్ధి చెందింది అనేటువంటి విషయాలు తెలిపారని పేర్కొన్నారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్, లాంచ్ ప్యాడ్లు, మ్యూజియంను సందర్శించారని వివరించారు. విద్యార్థినులకు పి.ఆర్.ఓ అనిల్ కుమార్ డిపార్ట్మెంట్స్ గురించి కూలంకషంగా వివరించారని తెలిపారు. ఈ సందర్శన వలన విద్యార్థినులు ఒక సంస్థ పనితీరు, దానిలో ఉన్న కష్టనష్టాలు, అందరూ కలిసికట్టుగా పని చేయటం వలన కలిగే ప్రయోజనాలు తదితర విషయములను తెలుసుకున్నారని చెప్పారు. అలాగే రాకెట్ లాంచ్ చేసేటప్పుడు వివిధ విభాగాల సమన్వయం, వారు ఫేస్ చేసే స్ట్రెస్ గురించి తెలిపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎన్. శ్రీరజనీ, డాక్టర్ వి. భార్గవి, డాక్టర్ జి. సుభాషిణి, డాక్టర్ వై. సునీత తదితరులు పాల్గొన్నారు.

పాలీ క్యాబ్ వైర్లు సురక్షితం

విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : పాలీ క్యాబ్ గ్రీన్ వైర్లు ఎంతో సురక్షితమని పాలీ క్యాబ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నీలేష్ మలాని తెలిపారు. సోమవారం ఓ ప్రైవేటు హోటల్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాలీ క్యాబ్ సుప్రసిద్ధ ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీ ఇప్పుడు దేశంలో కేబుల్స్ వైయస్ ల్యాండ్ కేఫ్ ను మార్చుతూ తాజా టెలివిజన్ కమర్షియల్ ను విడుదల చేసిందన్నారు. దీని ద్వారా ప్రతి ఒక్కరి భద్రత సంక్షేమం కోసం తమ పాలిక్యాబ్ గ్రీన్ వైర్లు ఉపయోగపడుతుందన్నారు.పాలీ క్యాబ్ వైర్స్ విభాగంలో వైవిధ్యమైన మార్కెటింగ్ అగ్రగామిగా నిలవడంతో పాటుగా విస్తృత శ్రేణి ప్రశంసలను సైతం పొందుతుందన్నారు. ఎలాంటి ఇంటిలోనైనా మొత్తం విద్యుత్ వ్యవస్థకు వెన్నుముకగా వైరు నిలుస్తాయన్నారు.వినియోగదారులు సురక్షితమైన నాణ్యమైన సరసమైన ధరలకు లభించే పాలే క్యాబ్ వైర్లను వినియోగించాలని సూచించారు.ఈ సమావేశంలో ఓగ్లీవి ఇండియా ఆఫ్ క్రియేటివ్ ఆఫీసర్ సుఖేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ హోం గార్డు రూటే సప'రేటు'

ముక్కంటి ఆలయంలో దళారీ అవతారం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పనిచేసే ఓ హోం గార్డు రూటే సప'రేటు'గా ఉంది. ఆలయంలో దళారీ అవతారమెత్తి జేబులు నింపుకుంటున్నాడు. అంతే కాదండోయ్... ఆయన భక్తుల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణ ఉన్నప్పటికీ ఆయనపై ఎలాంటి చర్యలూ లేవు. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో హోం గార్డు ఉన్నాడు. ఆయన ఇక్కడ సుమారు దశాబ్ద కాలంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా హోం గార్డులను ఏడాదికో... రెండేళ్లకో బదిలీ చేస్తుంటారు. అయితే ఈయన విషయంలో మాత్రం అధికారులు ఆ నిబంధన పాటించడం లేదు. ఉన్నతాధికారుల అండతో ఈయన ఇక్కడే తిష్ట వేశారు. ఇదే అదనుగా ఆలయాన్ని ఈయన ఆదాయ వనరు కేంద్రంగా మార్చుకున్నాడు. ఆలయంలో హోంగార్డులకు విధులు కేటాయించే బాధ్యత ఉన్నతాధికారులు ఈయనకు అప్పగించారు. ఈ అధికారం అడ్డం పెట్టుకుని తనకు అనుకూలంగా ఉన్న వారికి అడిగిన చోట పాయింట్ కేటాయిస్తారు. అనుకూలంగా లేని వారికి ఎక్కడ పడితే అక్కడ విధులు వేస్తారు. పాయింట్లు కేటాయించడానికి కూడా మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణ బలంగా ఉంది. ఇది ఎంతవరకు వాస్తవమో ముక్కంటీశునికే ఎరుక. ఇక సెక్యూరిటీ విభాగంలో పని చేసే మహిళలను ఈయన ఏక వచనంతో సంబోధించడం... పరుష పదజాలంతో మాట్లాడుతుంటారని విమర్శ ఉంది. ఈయన మాటల తీరు కారణంగా సెక్యూరిటీ విభాగంలో పని చేసే పలువురు మహిళలు మానసికంగా కుంగి పోతున్నారు. ఇక ఈయన అసలైన దళారులను విడిచి పెట్టి... ఎపుడో ఒకసారి దర్శనం వచ్చే సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారనే విమర్శ కూడా ఉంది. ముక్కంటి ఆలయ అధికారులు ఇకనైనా స్పందించి ఈయన తీరుపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ముక్కంటి క్షేత్రం... భక్తజన సంద్రం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ముక్కంటి క్షేత్రం భక్తజన సంద్రమైంది. కార్తీకమాసం రెండవ సోమవారం పురస్కరించుకుని స్వామి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. సాయంత్రం వేళ శుభ ఘడియలు ఉండటంతో శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులతో ముక్కంటీ ఆలయం కిటకిటలాడింది. ఆలయ అధికారుల లెక్క ప్రకారం 35వేలకు పైగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక సాయంత్రం 6గంటల వరకు 4,087 మంది రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకున్నారు. ఇక రూ.200 ప్రత్యేక దర్శనం ద్వారా 1,919 మంది, రూ.50 టికెట్టు ద్వారా 2,780మంది దర్శించుకున్నారు. ప్రసాదాలు 29,213 విక్రయించారు.

మహిళల అక్రమ రవాణా అరికడదాం: సీడీపీవో

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మహిళల అక్రమ రవాణా అరికట్టాలని శ్రీకాళహస్తి సీడీపీవో శాంతిదుర్గ కోరారు. శ్రీకాళహస్తి పట్టణం కైకాలవీధిలో గల అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...లైంగిక వేధింపుల నిర్మూలన, మహిళా సంరక్షణ, మహిళల అక్రమ రవాణా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఆమె కోరారు. పరిసరప్రాంతాలు గమనిస్తూ..సందేహం ఉంటే టీచర్లకు లేదా పారా లీగల్ వలంటరీ ద్వారా తమకు తెలివితే తగిన పరిష్కారం చూపుతామని ఆమె హామీ ఇచ్చారు. ఇక న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ...చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులకు న్యాయ సహకారం ఉచితంగా అందిస్తామన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమకు తెలపాలని కోరారు. అలాగే న్యాయ సలహాలకు 15100 ఫోన్ నెంబరుకు తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది అరుణ్, సూపర్ వైజరు హరిత తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

వ్యాస రచన పోటీలలో సత్య సాయి సేవా సమితిచే బహుమతి

విశాలాంధ్ర - చిత్తూరు: శ్రీ సత్యసాయి సేవా సంస్థచే నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో "భారతీయ సంస్కృతి" అనే అంశం పై జూనియర్ కాలేజి తెలుగు మాధ్యమంలో రాష్ట్ర స్థాయిలో తేదీ గత నెల 22 న పరీక్ష జరిగింది. చిత్తూరు జిల్లా స్థాయిలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి వచ్చిన పేపర్స్ రాష్ట్ర స్థాయిలో పంపడం జరిగింది. అందులో మన జిల్లాకు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థాయి అబు బక్కర్‌కి దక్కిందని సేవాసమితి జిల్లా ప్రెసిడెంట్ ఎస్ మధుసుదనం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మణరావు ,జిల్లా అధ్యక్షులు మధుసూదన్, జిల్లా విద్యా విభాగపు సమన్వయకర్తలు శ్రీమతి వసంత, శంకర్ బాలకృష్ణ రెడ్డి, శ్రీ సత్య సాయి భక్త సహాయక సంఘ ఉపాధ్యక్షులు, సత్య నారాయణ, సెక్రెటరీ కంటయ్య జిల్లా పదధికారులు, ప్రిన్సిపాల్, సయ్యద్ మౌల సమితి కన్వీనర్ శేష నారాయణ, అభినందనలు తెలిపారు.

సమ సమాజం కోసం కృషి చేయాలి

- సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి టి.జనార్ధన్

విశాలాంధ్ర-చిత్తూరు: మహత్తర అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సందర్భంగా సెమినార్‌ను సిపిఐ ఆధ్వర్యంలో ఎస్‌టియు కార్యాలయంలో చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జనార్ధన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దేశాలు విముక్తి పొందడానికి అక్టోబర్ విప్లవం స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. రష్యాను విముక్తి చేసి క్రామేడ్ లేని నాయకత్వంలో మొదటి సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడిందన్నారు. దేశంలో ప్రజలందరికీ కూడు, గూడు,గుడ్డ, విద్య, వైద్యం కల్పించిందన్నారు. సామ్రాజ్యాల వాద దేశాలకు సింహ స్వప్నమైనది ప్రభుత్వరంగాలోని పరిశ్రమలు, భారీ ప్రాజెక్టులు స్థాపించబడింది సంపద మొత్తం వ్యక్తిగతంగా కాకుండా సమాజ పరంగా ఉంచడం జరిగింది అన్నారు భారత దేశంలో స్వాతంత్ర పోరాటాలకు విముక్తికి అక్టోబర్ విప్లవం దన్నుగా నిలిచింది అమెరికా సామ్రాజ్యవాదం దురాగతాలను ఎండబెడుతూ బడుగుదేశాలు రష్యా విప్లవ స్ఫూర్తితో చైనా, వియత్నం, క్యూబా, కొరియా దేశంలో విప్లవం విజయవంతం అయిందన్నారు సమ సమాజం కోసం కార్మిక రాజ్యం స్థాపన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్ నాగరాజు, సిపిఐ చిత్తూరు నగర కార్యదర్శి గోపి, గోపీనాథ్, సిపిఐ నాయకులు సత్యమూర్తి, దాసరి చంద్ర, సుబ్రహ్మణ్యం, గుర్రప్ప, మార్కొండయ్య, విజయ గౌరీ, రమాదేవి, కుమారి, కోమల, ఏఐటీయూసీ నాయకులు ప్రేమ, ప్రభావతి, చంద్ర, జయశంకర్, చంద్రయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులను వేగవంతగా పూర్తి చేయండి

విశాలాంధ్ర - కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వాడు నేడు పనులను శర వేగంగా పూర్తి చేయాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి ఎం. విజయకుమార్ తో కలసి డీఎం పురం ఉన్నత పాఠశాలలో నిర్మాణం చేపడుతున్న ఆదనపు గదుల నిర్మాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో రెండవ విడత నాడు నేడు పనులు 21 పాఠశాలలకు మంజూరు కావడం జరిగిందన్నారు. పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని, ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లి ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించేలా చూడాలన్నారు. 10వ తరగతిలో ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం నమశ్శివాయను అభినందించారు. మండలంలోని ఉన్నత పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా చూడాలని కోరారు. ఎంపీపీ వెంట ఎంపీడీవో మోహన మురళీ,ధనశేఖర్ వర్మ, ఉపాధ్యాయులు తిరుమలరాజు, సుబ్రమణ్యం రెడ్డి పలువురు పాల్గొన్నారు.

మా మాన ప్రాణాలను కాపాడండి - రుణ విముక్తం చేయండి



విశాలాంధ్ర - వి.కోట: వైకాపా ప్రభుత్వం వచ్చాక పద్నాలుగు నెలలపాటు అప్పటి తాగునీటి కరువు దృష్ట్యా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పంచాయతీలకు తాగు నీరు అందించి అప్పుల పాలయ్యాం.. లక్షల్లో అప్పుల్లో కూరుకు పోయాం... నగలు తాకట్టు పెట్టి వడ్డీలు కడుతున్నాం.. బకాయిలు చెల్లించలేదని ఫైనాన్సియర్లు ట్రాక్టర్ లు తీసుకెళ్లి పోయారు. దయచేసి మమ్మల్ని ఆదుకోండి అంటూ సోమవారం పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని పంచాయతీల ప్రజలకు తాగునీరు అందించిన బాధితులు నీటి బిల్లులు సాధనకై సోమవారం వి. కోటలో సమావేశమై ఛలో అమరావతీకి కార్యాచరణ కు సిద్ధమౌతున్నారు. గతంలో ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వ ఛీప్ సెక్రటరీ సజ్జల రామకృష్ణారెడ్డి ని కలశామని అయితే అప్పట్లో స్పందించిన ఆయన రెండు నెలల బిల్లులు అందజేశారని పేర్కొన్నారు. మళ్లీ నీటి బిల్లుల సంగతే మరచిపోయారన్నారు.ఒక్క పలమనేరు నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాలకు సుమారు 10.కోట్ల 48 లక్షలు బకాయిలు రావాల్సి ఉండగా కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నీటి బిల్లులు దాదాపు గా 17 కోట్ల బకాయిలు రావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం మా సమస్యల పై స్పందించి మాకున్న అప్పులు తొలగించి మా మాన ప్రాణాలను కాపాడాలని నీళ్ల ట్యాంకర్ల బాధితులు ఆవేదనతో వేడుకుంటున్నారు.

పాఠశాలకు భూమి పూజ...



విశాలాంధ్ర - వి.కోట: మండలంలో నాడు - నేడు కింద పలు పాఠశాలల నిర్మాణాల కు ఎంపిపి యువరాజ్ చొరవ చూపుతున్నారు. అవసరమైన చోట్ల కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కు విద్యాశాఖ తో చర్చలు జరిపి పనులు ప్రారంభం చేయిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం మండల పరిధిలోని సంత బండపల్లి పంచాయతీ పెసలుదొడ్డి గ్రామంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి ఛైర్మెన్ అమర్నాథ్ తో కలసిభూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జి. రఘుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జె ఏన్ టి యూనివర్సిటీ వాలీబాల్ చెస్‌లో యూనివర్సిటీ టీంకు మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - పలమనేరు : అనంతపురంలోని జెఎన్ టి యూనివర్సిటీ యొక్క వాలీబాల్ చెస్ టీములలోకి మదర్ తెరిసా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని వీరు యూనివర్సిటీ టీములో పోటీలో పాల్గొంటారని కళాశాల కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు తెలిపారు.కళాశాలలోని విభాగంలో థర్డ్ బిటెక్ చదువుతున్న ఎస్ తాహిర్ అనే విద్యార్థి యూని వర్సిటీ వాలీబాల్ టీమ్‌లో ప్లేయర్గా ఎంపికయ్యాడని థర్డ్ బిటెక్ ఈసీఈ గ్రూపులో చదువుతున్న బి భారతి అనే విద్యార్థి యూనివర్సిటీ చదరంగం చెస్ టీముకు ఎంపికయ్యాడని వీరు ఇరువురు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని కరస్పాండెంట్ తెలిపారు. యూనివర్సిటీ టీంకు ఎంపికైన ఈ ఇద్దరు విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు,చైర్మన్ ఎం ఆర్ సునీల్,అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి,ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, పీడీలు ప్రవీణ్, మురళి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఈ.ఎస్.ఐ. ఆసుపత్రిలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్



విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : తిరుపతి నగరం, స్థానిక ఆర్.సి.రోడ్ లోని కార్మిక రాజ్య బీమా ఈ.ఎస్.ఐ ఆసుపత్రిలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ను పురస్కరించుకొని సోమవారం అవినీతి నిర్మూలన పై కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ విధినిర్వహ ణలో అవినీతికి తావులేకుండా ప్రజలకు సేవలు అందించాలని ,ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ను సంస్మరణ చేసుకొంటూ ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్. కె. శ్రీధర్ పేర్కొన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పనిచేస్తామని సిబ్బంది, డాక్టర్లు చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. కె. శ్రీధర్ తో పాటు ఆర్.ఎం.ఓ. డాక్టర్. రమేష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సి. అమ్ములు, కార్యాలయ అధికారి ఎం.నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించి

ఉద్యోగ భద్రతకల్పించాలి

- ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య , సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

విశాలాంధ్ర - చిత్తూరు: గ్రీన్ అంబాసిడర్ లకు పెండింగ్ జీతాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలనీ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. స్వచ్ఛభారత్ కింద కార్మికుల్ని అపాయింట్మెంట్ చేసుకొని 6 సంవత్సరాలు పైన అవుతున్న కార్మికులకు ఎప్పటికీ పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించలేదు, అనేకసార్లు కార్మికుల అధికారులు తీసుకొచ్చిన సమస్య పరిష్కారం లేదు. అనేక సంక్షేమం పథకాలను ప్రవేశపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు గ్రామస్థాయిలో పరిశుభ్రం చేస్తూ ప్రజల్ని అనారోగ్యం బారిన పడకుండా తడి చెత్త పొడి చెత్తను వేరు చేస్తూ గ్రామాల్లో అన్నింటిని శుభ్రపరుస్తూ పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. ఈరోజు 15 ఫైనాన్స్ ద్వారా కార్మికులకు జీతాలు చెల్లిస్తామని చెప్తున్నప్పటికీ ఇంతవరకు అమలు కాలేదు, 15 ఫైనాన్స్ ద్వారా పంచాయతీల్లో ఉన్నటువంటి సర్పంచి కార్యదర్శులు జీతాలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పంచాయతీలో నిధులు లేవని మేము జీతాలు పెట్టలేమని సుమారు నాలుగు ఐదు సంవత్సరాల కు పని చేస్తున్న కార్మికుల్ని జీతాలు ఇవ్వలేము మీరు నిలిచిపోండని పంచాయతీల్లో కార్మికులను బెదిరిస్తున్నారు కొన్ని పంచాయతీల కార్మికుల్ని పని నుంచి తొలగిస్తున్నారు. ఏ ఐ టి యు సి గా దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము. పని నుంచి తొలగించిన కార్మికులను వెంటనే పనిలో పెట్టుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు, కార్మికలు చేయు పోరాటానికి సంఘీభావంగా సిపి పార్టీ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ ఏఐటీయూసీ నాయకులు దాసరి చంద్ర సత్యమూర్తి, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవింద స్వామి నాయకులు రాజేంద్ర మార్కండేయులు ఏసు పాదం రమేష్ గిరిధర్, శ్రీనివాసులు కృష్ణయ్య, కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పి.ఇ.ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కుప్పం : స్వయం శక్తితో అంచలంచలుగా పల్లె నుంచి పట్నం వరకు ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండి అనేక విద్య సంస్థల ను స్థాపించి అనేక మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా, నాయకులుగా తీర్చి దిద్ది అనేక మందికి తమ యొక్క సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించి ఎమ్మెల్సీ గా పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన పి ఇఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు, కర్ణాటక ప్రభుత్వ విద్య సలహాదారు మాజీ ఎమ్మెల్సీ డా. ఎం.ఆర్.దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలను కుప్పం పి ఇ ఎస్ ఆసుపత్రి నందు వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పీ. ఈ.ఎస్ ఆసుపత్రి నందు రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ ను అందజేశారు. కుప్పం నందు గల బధిర పాఠశాల నందు 150 మంది విద్యార్థులకు పాలు, పండ్లు మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.దొరస్వామి నాయుడు స్ఫూర్తిగా పలువురు వైద్యులు, విద్యార్థులు మరియు సిబ్బంది. ప్రాణాపాయ స్థితిలో వున్నవారిని ఆదుకోవడం కోసం సేవ దృక్పథంతో రక్తదానం చేసారు. వయస్సు పైబడి మోకాలి నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి రూ.1,50,000 ఖర్చు కాగల మోకాలి చిప్ప ఆపరేషన్ ను మెడికల్ సూపరింటెండెంట్ డా.చెన్న బసవ పాటిల్ ఉచితముగా నిర్వహించారు. చిత్తూరు పి ఇ ఎస్ పబ్లిక్ స్కూల్ నందు సుమారు 700 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డీన్ మరియు ప్రిన్సిపాల్ డా. కృష్ణా రావు, మెడికల్ సూపరింటెండెంట్ డా. చెన్న బసవ పాటిల్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి ఎంతో కొంత సమాజ సేవ దృక్పధం కలిగి ఉండాలని తెలియజేసారు . ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ సూపెరింటెండెంట్లు డా.మోహన రూప డా.శ్రీధర్ , ఎచ్ ఆర్ మేనేజర్ బాలరాజు , రాజ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర శివాలయం నందు అన్నాభిషేకం

విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ: కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం మంచి నీళ్ల గుంట శ్రీ కాశీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర శివాలయ నందు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు వైభవోపేతంగా అన్నం, ఇతర ఆహార పదార్థాలతో అలంకరణ పూరిత "అన్నాభిషేకం" చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ (మణి స్వామి) ఆధ్వర్యంలో జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

జలకంటేశ్వర స్వామి ఆలయంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

విశాలాంధ్ర - పెద్దపంజాణి : సోమవారం జెడ్పి చైర్ పర్సన్ వాసు కోగిలేరు జలకంటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి నాయకులు కల్లుపల్లి రెడ్డప్ప రెడ్డి,బాబు రెడ్డి, చిన్న, డాక్టర్ చంద్రశేఖర్, గజేంద్ర, ఆలయ ధర్మకర్త వెంకట్ రెడ్డి,సర్పంచ్ రమేష్, జడ్పీ చైర్మన్ వాసన్నకు నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో శివ శంకర్ రెడ్డి,శంకరప్ప గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కాశీ విశ్వ స్వామి ఆలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, జాంద్రపేట శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం రెండవ సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించే అర్చనలు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు .కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం అన్నాభిషేకం నిర్వహించి, జ్వాలా తోరణం జరిపారు.కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం పురస్కరించుకుని వైస్ ఎంపీపీ రాశి ప్రసాద్ దంపతులు పాల్గొని పూజలు చేశారు.ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో ఎంపీపీ సురేంద్ర రెడ్డి, సర్పంచ్ ఉషా నర్సింహులు, వైసీపీ నాయకులు నాదముని రెడ్డి ,గోవిందరెడ్డి, దేవేందర్ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధిలో బాధ్యతలను నెరవేరుస్తా: ఎంపీపీ

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు మండల అభివృద్ధి విషయంలో బాధ్యతలను నెరవేరుస్తానని స్థానిక ఎంపీపీ ప్రతిమసుశీల్ కుమార్ రెడ్డి స్పష్ట చేశారు.సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా జడ్పీ ఫైనాన్స్ స్థాయి సంఘం కమిటీ సభ్యులు,నారాయణవనం జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్,జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి,వైఎస్ఆర్సిపి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షులు బిరేంద్ర వర్మ,సింగిల్ విండో అధ్యక్షులు నిరంజన్ రెడ్డి,బెల్ట్ రమేష్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతిమసుశీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే జగనన్న కాలనీలో ఇండ్ల నిర్మాణాలు సరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు.అంతకు మునుపు ఎంపీపీ ప్రతిమ జన్మదిన సంబరాలను పురస్కరించుకొని జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ సమక్షంలో వైఎస్ఆర్సిపి నేతల మధ్య ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి భారీ కేకును కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.తదనంతరం పలువురు వైయస్ఆర్సీపీ నేతలు ఎంపీపీ ప్రతిమకు పూలమాలవేసి సాలువతో సత్కరించారు. సత్కరించిన వారిలో ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్,జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి,వైఎస్ఆర్సిపి జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు బిరేంద్ర వర్మ, సింగిల్ విండో అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి,బెల్ట్ రమేష్, మండల పరిషత్ వైస్ ఎంపీపీ సరోజిని రాబర్ట్,మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు మస్తానమ్మ, ఎంపీటీసీలు సెల్వి రమణ,సరావన,మోహన్ రెడ్డి, ఇంద్రాణికుమార్,షీలా రమేష్, సర్పంచులు మధుసూదన్ రావు,సుజాత సుధాకర్ రాజు, శేఖర్, గోవిందస్వామి,నాగమ్మ శ్రీరాములు రెడ్డి, జయ, బాలాజీ,మునుస్వామి, వైయస్ఆర్సీపీ నేతలు శ్రీనివాసులు రెడ్డి,ఢిల్లీ బాబుయాదవ్, గోవిందస్వామి, మునికృష్ణయ్య,చిన్నబ్బ,బాలకృష్ణ,గోపాల్ రెడ్డి, సెంథిల్ కుమార్,పెద్దిరెడ్డి వంశి రెడ్డి,శ్రీధర్ రెడ్డి, అజిత్, టెంకాయ కృష్ణయ్య,సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.తదనంతరం ఎంపీడీవో విజయ్ కుమారి ఆధ్వర్యంలో మండల పరిషత్తు అధికారులు రమణ కుమార్,శివయ్య, సురేష్ కుమార్ సిబ్బంది పలువురు ఎంపీపీ ప్రతిమకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.ఇదే తరహాలో వైయస్సార్ క్రాంతి పదం ఏపీఎం స్వర్ణలత,ఐసిడిఎస్ అధికారిని దేవ కుమారి, ఉపాధి ఏపీవో భాస్కర్ అయ్యా,హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య,పంచాయతీ సెక్రటరీలు పలువురు ఎంపీపీ ప్రతిమకు పూలమాలవేసి సాలువా ఘనంగా సత్కరించారు.

అప్రమత్తంతోనే క్యాన్సర్ వ్యాధి నివారణ

విశాలాంధ్ర పులిచెర్ల-కల్లూరు: అప్రమత్తంతోనే క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చునని వైద్య అధికారిణి జానకి రావు అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు లో సోమవారం నేషనల్ క్యాన్సర్ అవేర్నస్ దే ను నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ధూమపానం క్యాన్సర్ వ్యాధికి ముఖ్య కారణమని ధూమపానం ,పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని అన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్ట్

విశాలాంధ్ర - చిత్తూరు: నగరంలోని పలు ప్రాంతాలలో అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తూ అక్రమంగా సంపాదిస్తున్న ముఠా సభ్యులను చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఈ ముఠా వివరాలను ఎస్ పి రిశాంత్ రెడ్డి డియస్‌పి సుధాకర్ రెడ్డితో కలిసి విలేఖరులకు వివరించారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో సూడాన్ దేశానికి చెందిన వ్యక్తితో పాటు పలువురు ముఠా సభ్యులు యువతకు డ్రగ్స్ అమ్ముతున్నట్టు సమాచారం అందిందని, ఆదివారం నగర పరిధిలోని ఇరువారం సమీపంలోని బాల త్రిపు సుందరీ ఆలయం వద్ద డ్రగ్స్ అమ్ముటున్నట్టు పక్కా సమాచారం వచ్చిందన్నారు. అక్కడ 2 టౌన్ సి ఐ, సిబ్బంది చేరుకుని 6మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 2 లక్షల విలువైన 34 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో తవణంపల్లి కి చెందిన సిరాజ్, అహమ్మద్ ఒమర్, సురేష్, జయ శంకర్, ప్రతాప్, తేజ కుమార్, వెంకటేష్, మోహన్ మురళి, లను అదుపులోకి తీసుకున్నామన్నరు.వీరిలో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు అని తెలిపారు. అనంతరం డ్రగ్స్ ముఠా సభ్యులను పట్టుకుని రిమాండ్ కు పంపడానికి ప్రతిభ చూపిన సి ఐ యతేంద్ర, ఎస్ ఐ లు మల్లికార్జున, లోకేష్, ఏ ఎస్ ఐ మనోహర్, పి సిలు జయచంద్ర, సుధీర్, గోవిందరావు, ధరణి కుమార్, శివ కుమార్, సేందిల్ కుమార్ నాగేంద్ర బాబు, రాజేష్, కుమార్, జయ ప్రకాష్ రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

పులిచెర్లలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

విశాలాంధ్ర పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీవో షౌకత్ అలీ తెలిపారు. మండలంలో 2020 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాలలో పనులను తనిఖీ చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పండ్ల తోటల పెంపకం, ఫారం ఫండ్, బౌండ్రి ట్రెంచులు, అవెన్యూ ప్లాంటేషన్, భవన నిర్మాణాలను తనిఖీ బృందం తనిఖీ చేస్తున్నారు. సామాజిక ఎస్ ఆర్ పి ఆధ్వర్యంలో 16 మంది డిఆర్‌పిలు తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పలమనేరుకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేసిన వాలంటీర్

విశాలాంధ్ర - పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం పోశం వారి పల్లె పంచాయతీ దీన్నేపాటివారిపల్లెకు చెందిన వృద్ధురాలు రాజమ్మ అనారోగ్యం పలమనేరు లో చికిత్స పొందుతున్నది ఈ నేపథ్యంలో నవంబర్ నెలకి చెందిన వృద్ధాప్య పింఛన్ ను వాలంటీర్ హేమావతి పలమనేరుకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేశారు. వృద్ధురాలికి సకాలంలో పింఛన్ అందజేయడంతో వాలంటీర్ ను పలువురు అభినందించారు.

విద్యార్థిని పరామర్శించిన డివైఈవో చంద్రశేఖర్

విశాలాంధ్ర - పలమనేరు : సాయి చైతన్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని హరీష్ ను ఉపాధ్యాయుడు హ్యాండ్ రైటింగ్ సక్రమంగా రాయకపోవడంతో ఉపాధ్యాయుడు విద్యార్థిపై కొట్టడంతో విద్యార్థి హరీష్ కు భుజం తీవ్ర నొప్పితో బాధపడుతుండగా వారి తల్లిదండ్రులు ఏమని విచారించగా తనపై చైతన్య పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివ కొట్టడం వలన తనకు గాయం ఏర్పడిందనితల్లిదండ్రులకు తెలిపారు.ఈ విషయం డి వై ఈ ఓ చంద్రశేఖర్‌కు ఎంఈఓ లీలారాణి ని ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన డి వైఈ ఓఎంఈఓ చైతన్య పాఠశాలకు వెళ్లి జరిగిన విషయంపై చర్చించడం జరిగింది. ఆవిద్యార్థికి అయ్యే ఖర్చు పాఠశాల యాజమాన్యమే భరిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుడిని పాఠశాల విధుల నుండి తొలగించడం జరిగిందని చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఇక మీదట ఇలాంటి చర్యలు చేపడితే కఠిన చర్యలు చేపడతామని డి వై ఈ ఓ చంద్రశేఖర్ తెలిపారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి3

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు నియోజవర్గ వడ్డెర సంఘం జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని పలమనేరు తాసిల్దార్,ఆర్డీవో కార్యాలయం ముందు తమ నిరసనను తెలియజేశారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు విద్యా ఉద్యోగ రాజకీయం పరంగా ఎలాంటి గుర్తింపు లేక బిసి.ఏ జాబితాలో కొనసాగిస్తూ మన పాలకులు మోసం చేస్తూ తీవ్రంగా అన్యాయం చేకూరుస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో ప్రస్తుతం కుల వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి జీవన విధానం లోని వారి మనుగడ ప్రశ్నార్థంగా మారిందన్నారు.ప్రస్తుతం ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్టీ జాబితాలో చేరుస్తామని బహిరంగ సభ ద్వారా ఎన్నికలలో హామీ ఇచ్చి ఓటు బ్యాంకుగా వాడుకుని మోసం చేస్తూ మిన్నకుండిపోయారనిఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో మన పాలకుల మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా మన వడ్డెరలు ఐకమత్యంగాఎస్టీ సాధనకు ప్రధాన అజెండాగా కార్యచరణ రూపొందించుకుని పోరాటం ద్వారా నిరసనలను ఉధృతం చేసి ముందుకు పోయి మన లక్ష్యం వడ్డెరలను ఎస్టీ సాధన సాధించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో దేరంగుల సుబ్రహ్మణ్యం, స్వతంత్ర బాబు, నాగరాజు, హరికృష్ణ,చెన్నప్ప, తులసి ప్రసాద్, జగదీశ్వర్, వెంకటప్ప, మొగిలిలప్ప శ్యామ్, రమణ, రామకృష్ణ ,జానకి రామయ్య, మొదలగు నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోండి

-బీజేపీ నేత చంద్రప్ప



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరగ నున్న శాసన మండలి ఎన్నిక లను పురస్కరించుకుని పట్ట భద్రులు ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటురుగా నమోదు చేసుకోవాలని బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం శ్రీకాళహస్తి పట్టణం లోని జీవిత బీమా సంస్థ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓట్లపై అవగాహన కల్పించారు. పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకుని శాసనమండలి ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలల నిర్మాణాలకు నాణ్యత ప్రమాణాలు పాటించాలి: ఛైర్మన్

విశాలాంధ్ర - వి.కోట: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి సారించి చేపడుతున్న అభివృద్ధి లో భాగంగా నాడు - నేడుపథకం కింద చేపడుతున్న నిర్మాణాలకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మెన్ జి. శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన సొంత మండలంలో పలు చోట్ల పర్యటించారు. ఇందులో భాగంగా ఖాజీపేట లోని ఉర్దూ పాఠశాల లో జరుగుతున్న నాడు - నేడు పనులను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను సంబంధిత శాఖల సూచనల మేరకు చేపట్టి నిర్దిష్ట సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాక్‌కు సర్వం సిద్ధంగా ఉండండి

ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి

విశాలాంధ్ర–తిరుపతిఎస్వీయూ: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రతి శాఖ న్యాక్ పీర్ కమిటీ ముందుంచే ధ్రువపత్రాలతో సిద్ధంగా వుండాలని ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి ఉద్యోగులకు సూచించారు. ఈ ఆయన ఎస్వీయూ సెనేట్‌హాల్లో సోమవారం జరిగిన ఆచార్యుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎస్వీయూ రాష్ట్రంలో ఏ ప్లస్ గ్రేడ్ సాధించి ముందు వరుసలో నిలబడిన విధంగా ఈ సారి కూడా ఇంకా మెరుగైన గ్రేడ్ సాధిం చాలని ఆకాంక్షించారు. క్యాంపస్ సుందరీ కరణపై దృష్టి పెట్టాలన్నారు. రెక్టార్ ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విశ్వ విద్యాలయం 7సంవత్సరాల భవిష్యత్ న్యాక్ గ్రేడ్ పైన ఆధారప డివుందన్నారు. వైయక్తిక ప్రయోజనాలకంటే సంస్థ ప్రయోజనంపై దృష్టి వుంచి మంచి గ్రేడ్ పొందేలా అధ్యాపకులు కృషి చేయాలని పిలుపుని చ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య ఓ. మహ మ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ విశ్వవిద్యాల యంలో శౌచ సదుపా యాలు, అవస్థాపన సౌకర్యా లకోసం నిధులను కేటాయిం చామని, త్వరలో పనులు పూర్తి చేయడానికి అన్నిరకాల చర్యలు చేపడుతున్నా మన్నారు. ఎస్వీయూ న్యాక్ సంచాల కులు ఆచార్య ఎం. శ్రీనివాసులు రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా ఇప్పటి వరకు జరిగిన న్యాక్ ప్రక్రియను వివరించి, జరగవలసిన ప్రణాళికపై ఆచార్యులకు దిశానిర్దేశంచేశారు. విశ్వవిద్యాలయ అధికారులు న్యాక్ పర్యటనకోసం ఆర్థిక, హార్దిక సహకారం పరిపూర్ణంగా అందిస్తున్నారన్నారు. ఏడు పాయింట్లలో విశ్వవిద్యాలయం ఏవిషయంలో ముం దుంది, ఏ రంగాన్ని వృద్ధి పరచుకోవలసిన అవసరముంది సవివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రగ్రహణం

11 గంటలపాటు శ్రీవారి ఆలయం మూత

నేటి పౌర్ణమిగరుడసేవ రద్దు

విశాలాంధ్ర – తిరుమల : చంద్రగ్రహణం కారణంగా మంగళ వారం శ్రీవారి ఆలయ తలుపులు మూస వేయను న్నారు. ఈ కారణంగా ఇవాళ జరగాల్సిన పౌర్ణమి గరుడ సేవను కూడా టీటీడి రద్దు చేసింది. చంద్ర గ్రహణం నాడైన మంగళవారం ఉదయం 8 నుండి రాత్రి 7.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఈ సమయంలో శ్రీ వెంగమాంబ ఉచిత అన్నదాన సత్రాన్ని కూడా మూసి ఉంచుతారు. ఈ సందర్భంగా తిరుమల లోని పలు ప్రాంతాలలో చేపట్టే అన్నప్రసాద వితరణలు చేపట్ట రాదని టీటీడీ నిర్ణయించింది. కాగా రాత్రి ఏడున్నర గంటల తర్వాతనే వెంగమాంబ అన్నదాన సత్రం, ఇతర ప్రాంతాల్లో వితరణలు ప్రారంభమవుతాయి. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్ల తో తిరుమలకు రావాలని విజ్ఞప్తి చేస్తోంది. గ్రహణం కారణంగా అన్ని రకాల దర్శనాలు, ఆర్జితసేవ లను టీటీడి రద్దు చేసింది. శుద్ధి, ఇతర కైంకర్యాల అనంతరం రాత్రి 7.30 గంటల తర్వాత సర్వదర్శనం భక్తులను మాత్రమే వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2 ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. బుధవారం ఉదయం నుండి మిగిలిన అన్ని దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయి.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా



అవగాహనతోనే క్యాన్సర్ నివారణ : ఆచార్య సాయిసుజాత

విశాలాంధ్ర – తిరుపతి ఎస్వీయూ: ప్రజలలో అవగాహనతోనే క్యాన్సర్ నివారణ సాధ్యమ వుతుందని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్క్ అధ్యాపకులు ఆచార్య డి. సాయి సుజాత పేర్కొన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం సంద ర్భంగా రేణిగుంట మండలం గుత్తివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్క్ సహకారంతో ఆకాంక్ష స్వచ్ఛ ంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ పైన అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే కొన్ని పరీక్షల ద్వారా తెలుసుకోగలిగితే ప్రాణాపాయ ముప్పు నుంచి తప్పించుకోవచ్చునని తెలిపారు. అనంతరం డాక్టర్ టి. జనార్ధన్, డాక్టర్ పేరం రాగ ప్రియ క్యాన్సర్ వ్యాధిపై ప్రసంగించి ప్రజలకు అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాంబ, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దల రవిబాబు, ముఖ్య సలహాదారు పేరం రాధిక కిరణ్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ శివప్ప, నాన్ టీచింగ్ స్టాఫ్ శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థిని విద్యార్థులు, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్శిటీలో మానసిక ఆరోగ్యంపై అవగాహన

విశాలాంధ్ర – తిరుపతి ఎస్వీయూ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాన్ని వర్శిటీలోని లా విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు తమ మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత, ప్రవర్తన, ఆలోచ నలు, భావోద్రేకాలన్నింటిని ఎలా స్థిరంగా ఉంచుకోవాలో తెలుపుతూ మానసిక ఆరోగ్య ప్రాము ఖ్యతను గురించి వివరించారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్ట్ చల్లాలత మాట్లాడుతూ వివిధ రకాల మానసిక ఆరోగ్య సమస్యలను వివరిస్తూ మానసిక ప్రశాంతత, మానవ సత్సంబంధాలు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి, ఏకాగ్రత ఆత్మస్థైర్యం పెంపొందించుకోవడం ఎలా.. భావోద్రే కాలను అదుపులో ఉంచుకుంటూ సమతుల్యతగా ఎలా నడుచుకోవాలి అనే విషయాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది డాక్టర్ ఎం. ఇంద్రాణి, డాక్టర్ ఎం. సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి జిల్లాసమితి అధ్యక్ష ,కార్యదర్శులుగా వి.శ్రీనివాసులు,ఎన్. శ్రీరాములు ఎన్నిక

విశాలాంధ్ర – తిరుపతి: భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ ఆది వారం బైరాగిపట్టెడలో గల గంధమనేని శివయ్య భవన్ లో జరిగింది. ఈ మహాసభలు కార్మికుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించడంజరిగింది ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కేతాది రాధాకృష్ణ అధ్యక్షులు కే.కుమార్ రెడ్డిలు హాజరైనారు ఈ మహాసభలు ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు జరిగే అఖిలభారత మహా సభలపై చర్చించడం జరిగింది అలాగే తిరుపతి జిల్లా లో భవన నిర్మాణ కార్మికుల సంఘం విస్తరణ నిర్మాణం కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పోరాట రూపాల పై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది తిరుపతి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా 43 మంది ఎన్నికయినారు. ఇందులో కార్యదర్శి వర్గ సభ్యులుగా 11 మంది ..కార్యవర్గ సభ్యులుగా 19 మంది.. మరో 13 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కాబ డ్డారు. గౌరవాధ్యక్షులుగా కేతారి రాధాకృష్ణ అధ్యక్షులుగా వి. శ్రీనివాసులు –ప్రధాన కార్యదర్శిగా ఎన్. శ్రీరాములు కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి .కార్తీక్. చంద్రబాబు .రవి. హరిబాబు .కార్యవర్గ సభ్యులుగా షేక్ లాల్.సెల్వ.వాసు.షబ్బీర్. రమణ. చిరంజీవి .భాస్కర్. బాలకృష్ణ.శరవణ.ప్రకాష్. తదితరులు ఎన్నికయ్యారు

కార్తీక వనభోజనం మహోత్సవ ఆహ్వానం

- ఆలయ చైర్మన్ చిల్లకూరు సాయిరెడ్డి

విశాలాంధ్ర – చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నందు కార్తీక మాసం సందర్భంగా భక్తులకు ఆలయ ప్రాంగణంలో వన భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చిల్లకూరు సాయి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 9వ తారీకున ఆలయ ప్రాంగణంలో శ్రీ రమాదేవి,శ్రీ సత్యనారాయణ స్వామి వారి సామూహిక వ్రతం మరియు కార్తీక వనభోజనం ఆలయ పూల తోట నందు ఉసిరి చెట్టు కింద ఏర్పాటు చేయనున్నట్లు భక్తులు 8వ తారీకు గ్రహణం వదిలిన తర్వాత 9వ తారీఖున కార్తీకమాసంలో ఇలాంటి పూజలు చేయడం వలన భక్తులు ఆయురారోగ్యలతో ఉంటారని ఎనిమిదవ తారీఖు నుండి 23వ తారీకు వరకు ప్రతిరోజు పూజలు జరపడం జరుగుతుందని 23వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి సహస్ర జ్యోతి లింగార్చన,సైకత శివ దర్శన అభిషేకం,పుష్పయాగం మరియు శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ కోమలేశ్వరి స్వామి,శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కళ్యాణము జరపడం జరుగుతుందని అనంతరం భక్తులకు అన్నప్రసాదనా కార్యక్రమం జరుగుతుందని భక్తుల సౌకర్యార్థం కార్తీక మాసం సందర్భంగా ఆలయ ఆవరణ ప్రాంగణంలో పాలకమండల సభ్యులతో కలసి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన అన్నారు.

రాజేశ్వరికి డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర – తిరుపతి ఎస్వీయూ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి టంకం రాజేశ్వరికి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం. దామ్లా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె అదే విభాగానికి చెందిన అధ్యాపకులు ఆచార్య వెంకటాపురం పద్మావతి మార్గదర్శకత్వంలో " ఏ స్టడీ ఆన్ బయోలాజికల్ పొటెన్షియల్ హెటిరో సైకిల్స్" అనే అంశంపై పరిశోధనాగ్రంథాన్నివర్శిటీకి సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించినట్లు వెల్లడించారు. రాజేశ్వరి కి డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటం తప్పదు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధ కృష్ణ

విశాలాంధ్ర – తిరుపతి: గ్రామీణ ప్రాంతాల్లో చెత్తాచెదారం, కాలువలు తీస్తూ గ్రామాలని పరిశుభ్రంగా ఉంచుతూ వారి ప్రాణాలు ఫణంగా పెట్టి గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికులు గ్రీన్ అంబాసిడర్లు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధ కృష్ణ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఏ.పి గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధ కృష్ణ మాట్లాడుతూ ఏఐటీయూసీ స్వచ్ భారత్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న పోరాటానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. మీ పోరాటం విజయవంతం కావాలని కాంక్షిస్తున్నామన్నారు. భవిష్యత్తులో జిల్లాలో మొత్తం అన్ని గ్రామాల్లో ఉన్న గ్రీన్ అంబాసిడర్ వర్కర్లని కదిలించి పెద్ద ఎత్తున పోరాటాలకి, అవసరమైతే సమ్మెకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల పాదయాత్రలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న వారి కష్టానికి లక్ష రూపాయలు జీతాలు ఇచ్చినా తక్కువే అని, వాళ్ళ కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిన జల్లుకుంటే పుణ్యం వస్తుందని చేసిన ఉపన్యాసాలు కేవలం ముఖ్యమంత్రి పీఠం కోసం కార్మికుల ఓట్ల కోసం చేసిన మోసపూరిత ఉపన్యాసాలే అని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా మీరు, మీ ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రతి నెలా జీతాలు తీసుకుంటూ మీ ప్రాంతాల్లో మురికి వాడలు శుభ్రం చేస్తూ మీ ఆరోగ్యాలను, ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ కార్మికులు రోగాల భారిన పడుతూ త్యాగం చేస్తున్న కార్మికుల జీతాలు మాత్రం ప్రతీ నెలా ఇవ్వరా అని ప్రశ్నించారు. మీరంతా ఒక్క నెల జీతం తీసుకోకుండా ఉండగలరా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న కార్మికులకు మీరు అసెంబ్లీలో చెప్పిన ప్రకారం 18 వేలు వేతనం పెంచకపోతే ప్రత్యక్ష పోరాటం తప్పదని హెచ్చరించారు. 10 నెలలుగా పెండింగులో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ స్యలు పరిష్కరం అయ్యేవరకు గ్రీన్ అంబాసిడర్ కార్మికులందరికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకి జీతాలు పెంపుదల చేయలేకుండా చాలీచాలని జీతాలు నెలల తరబడి ఇవ్వకుండా గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోవడం దారుణమన్నారు. కరోనలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రాణాలకు తెగించి పనులు చేశారన్నారు. సబ్బులు, కొబ్బరి నూనె, ఏడాదికి 3 జతల బట్టలు, బూట్లు, గ్లౌజ్ లు ఇవ్వకపోతే వారికి వచ్చే జబ్బులకు.ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కార్మికులు మరణిస్తే దహన ఖర్చులు ఇవ్వలేదని అన్నారు. పి.ఎఫ్, ఐ. ఎస్.ఐ సదుపాయాలు లేక రోగాలు వస్తే బాగుచేయించుకునే అవకాశాలు కూడా లేవన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే దశలవారి పోరాటాలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయ కులు చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ డి రవి, సర్దార్ శివ, నాగరాణి ఏపీ గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నాదొరై, మునిచంద్ర, మీనాక్షి, శాంతి,సరళ, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

చక్రాల ఉషాపై కేసు నమోదు దారుణం

- తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి

విశాలాంధ్ర – గూడూరు : అదృశ్యమైన అమ్మాయి కోసం వారి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు పోరాటం చేస్తే అట్రాసిటీ కేసు నమోదు చేయడం దారుణమని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి ధ్వజమెత్తారు. సోమవారం ఆమె గూడూరులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో చంద్రిత అనే అమ్మాయి కనిపించకపోతే వారి తల్లిదండ్రులు తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉషని తన బిడ్డ తరుపున న్యాయం చేయమని కోరారన్నారు. ఒక మహి ళగా ఆమె భాదిత కుటుంబానికి అండగా నిలిచి న్యాయం కోసం పోరాడితే, ఆమెపై అలాగే తెలుగు దేశం పార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ ఘటన ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వంలో భాదితులకు న్యాయం జరిగే దాఖలాలు లేవన్నారు. కదా ఎవరైనా గొంతెత్తి ప్రశ్నిస్తే వారు శిక్ష అనుభవించవలసిన దౌర్భాగ్య పరిస్థితి చూస్తున్నామన్నారు. కేసులు నమోదు చేయడంలో ఉన్న శ్రద్ధ న్యాయం చేయడంలో చూపాలన్నారు. ఇకనైనా మీ తీరు మార్చుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె హితవు పలికారు.

టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర – గూడూరు : మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఏళ్ల తరబడి ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, పంపు ఆపరేటర్, వాచ్‌మెన్లుగా పనిచేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు సోమవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను ఆప్కాస్‌లోకి మార్చాలన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలన్నారు. కరోనా సమయంలో రెండు నెలలపాటు వారి జీతంలో తగ్గించిన పది శాతం నగదును తిరిగి చెల్లించాలన్నారు. జీఓ.నెం.30ను సవరించి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు చెల్లించాలని కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను గుర్తించి ఆప్కాస్‌లో చేర్చాలని, వారిని క్రమ బద్ధీకరించాలని కోరారు. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏంబేటి చంద్రయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు రాఘవులు, ప్రసాద్, కామేశ్వరరావు, శ్రీకాంత్, నయీమ్, సుబ్రమణ్యం, రమణయ్య, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ యువకునికి రూ.50వేల చేయూత

విశాలాంధ్ర – గూడూరు : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రోటరీక్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అఖిల్ అనే యువకుడికి ఆర్డీఓ కిరణ్ కుమార్ చేతులమీదుగా 50వేల రూపాయల నగదు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోటరీ వెస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ప్రమాదంలో గాయపడ్డ యువకుడికి చేయూత అందించడం సంతోషదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి, రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, క్లబ్ ప్రతినిధులు రాంప్రసాద్, సుబ్రమణ్యం, బోమిడి శ్రీనివాసులు, వాసుగౌడ్, తాళ్ళూరు శ్రీనివాసులు, శ్రీకాంత్రెడ్డి, నాగరాజు, నరసప్ప సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ఆర్డీఓకు ఎమ్మెల్యే వినతి

విశాలాంధ్ర – గూడూరు : జగనన్న కాలనీలో లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించాలని ఆర్డీఓ కిరణ్ కుమార్‌కు సూచించామని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు తెలిపారు. సోమవారం ఆయనర గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓతో పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళ సముదాయంలో కూడా వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. పట్టణానికి తాగునీరు సరఫరా చేసే కండలేరు నుండి ఏర్పాటుచేసిన పైపులైను నాసిరకంగా ఉందన్నారు. 55 కోట్లతో ఇనుము పైపులైను ఏర్పాటు చేసే విషయమై చర్చించామని ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలి : డీఎల్ పీఓ

విశాలాంధ్ర – గూడూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలని డీఎల్ పీఓ వాణి అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయం సమీపంలో ఉన్న 8, 9వ సచివాలయాలను సోమవారం డీఎల్ పిఓ వాణి సందర్శించారు. అక్కడి సిబ్బందితో సంక్షేమ పథకాలపై చర్చించారు. వారికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. యాప్‌ల పనితీరు, సమయపాలన, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై చర్చించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

వడ్డి జగదీశ్‌కు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర – తిరుపతి ఎస్వీయూ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగము పరిశోధక విద్యార్థి వడ్డి జగదీశ్ కు డాక్టరేట్ ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం. దామ్లా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన అదే విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ నారాయణ మార్గదర్శకత్వంలో "సుశీల టాక్ భౌరే కే సాహిత్య మే దళిత నారీ సంఘర్ష" అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించినట్లు వెల్లడించారు. వడ్డి జగదీశ్ పరిశోధనా సమయంలో పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని అనేక పత్రసమర్పణలు చేశారు. న్యూ ఢిల్లీలోని కేంద్రీయ హిందీ నిదేశాలయ్ వారు నిర్వహించే వివిధ కార్యశాలలో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో పలు సాహిత్య అవార్డులు పొందారు. వడ్డి జగదీశ్ కు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల హిందీ విభాగపు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

- తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- తనపల్లి పంచాయతీలో రూ.1.78 కోట్లతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర –తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని తిరుపతి ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మహా పాదయాత్ర లో భాగంగా సోమవారం తనపల్లి పంచాయతీలో పర్యటించారు. సర్పంచ్ సునీత సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. పూల జల్లులతో, హారతులు పట్టారు. బాణసంచా మోత మోగించారు. గడప గడపకు వెళ్ళిన మోహిత్‌రెడ్డి ప్రజలతో మమేకమయ్యారు. ఆప్యాయంగా పలకరించారు. మహిళలు కూడా ఎంపీపీ పట్ల ఆదరణ చూపారు. బాగున్నారా అంటూ వారి సంక్షే మాన్ని అడిగి తెలుసుకున్నారు.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతు న్నాయా..! అంటూ వాకబు చేశారు. మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ప్రజలు కూడా తమ వినతులను మోహిత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల వినతులను స్వీకరించిన ఎంపీపీ పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. మహా పాదయాత్రలో భాగంగా ప్రజల విజ్ఞాపన మేరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలను మంజూరు చేశారు. పంచాయతీలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. వారికి చాక్లెట్ లు పంచిపెట్టారు.

రూ.1.78 కోట్లతో అభివృద్ధి పనులు: తనపల్లి పంచాయతీలో రూ.1.78 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీపీ వెల్లడించారు. ఇందులో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.70 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, స్వయం సహాయక సంఘాల సమావేశ మందిరం, పాలకేంద్రం, గ్రామ వేదికలు ఏర్పాటుకు రూ. 1.08 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఎంపీపీ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగనన్న మూడేళ్ల పాలనలో మరిన్ని పథకాలు, మేనిఫెస్టోలోని హామీలు అమలు చేసి రాష్ట్రాన్ని సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దారని తెలియజేశారు. జగనన్న తాను ఇచ్చిన హామీలతో పాటు నవరత్నాలను అమలు చేశారని వివరించారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు, వారి పిల్లల చదువు, మహిళల రుణాలు, రైతులకు భరోసా, పేదలకు ఇళ్లు నిర్మించారని గుర్తుచేశారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రాన్ని సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేశారన్నారు.

శాంతమ్మకు భరోసా..: తనపల్లి పంచాయతీలో మోహిత్ రెడ్డి మహా పాదయాత్ర పర్యటనలో భాగంగా అమ్మ శాంతమ్మ, కుమార్తె సావిత్రమ్మ ఇబ్బందులను ఆలకించారు. మగదిక్కు లేదని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇంటి పట్టా ఇచ్చారు.. కానీ స్థలం చూపలేదని తెలియజేశారు. అంతే కాకుండా సావిత్రమ్మ బోధకాలతో బాధపడుతున్నానని కన్నీటి పర్యంతమైంది. స్పందించిన మోహిత్‌రెడ్డి వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నరాల బలహీన వ్యాధితో బాధపడుతున్న రామకృష్ణారెడ్డిని పరామర్శించారు. ఆర్థిక సాయం చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీత సుబ్రమణ్యం రెడ్డి, ఎంపీటీసీ రెడ్డయ్యా, ఉప సర్పంచ్ కల్యాణి విజయసింహా రెడ్డి, మాజీ ఎంపీటీసీ మురళి, వినోద్ రెడ్డి,నాగరాజు, చెంచురెడ్డి,నాగరాజురెడ్డి, హేమంత్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

In the court of the principal junior civil judge: srikalahasthi

O.S No. 273/2022

Between: Pacha Satish Prasad ......Plaintiff

And

Sajja Parameswaraiah ....Defendant

దావా నోటీసు

నాక్టయింట్అయిన పచ్చా సతీష్‌ప్రసాద్ వద్ద నుండి మీరు తీసుకున్న పైకము వసూలుకై వారు పై దావాను శ్రీయుత ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి వారికోర్టులో వేసిన దావా ఓ.యస్.నెం. 273/22 మీకు దావా సమన్లు అందనందు వలన కోర్టు వారి ఆదేశాల మేరకు పేపరు నందు ప్రచురించడమైనది. సదరు దావా తేది: 21.11.2022న కు మీయొక్క హాజరు కొరకు వున్నది. కావున మీరు తేది:21.11.2022వ తేదిన హాజరు అయి గాని లేదా వకీలు ద్వారా గాని వచ్చి మీ యొక్క అభ్యంతరము తెలియజేయవల యును. లేనిచో మీ పరోక్షమున కేసు నందు తీర్పు చెప్పబడును. కావున తెలియజేయడమైనది.

అరంబాకం మునిప్రసాద్ బి.ఎ.,బి.ఎల్.,
న్యాయవాది, శ్రీకాళహస్తి
సెల్:9502020107